

ఎర్రచందనం స్టాక్ పాయింట్‌గా బైరెడ్డిపల్లె !

రైతు ఇంట్లో దాచిన రూ.50 లక్షల సరుకు పట్టివేత



అలప్పల్లి కొత్తూరు సమీపంలో అటవీశాఖ అధికారులు పట్టుకున్న ఎర్రచందనం దుంగలు

పలమనేరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):ఎర్రచందనం స్టాక్ పాయింట్‌గా బైరెడ్డిపల్లెను స్మగ్లర్లు వాడుకుంటున్నట్లు తాజాగా బయటపడింది. తిరుపతి పరిసరాల నుంచి సేకరించిన ఎర్రచందనం దుంగలను బైరెడ్డిపల్లె మండలం మీదుగా కర్ణాటకకు స్మగ్లింగ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు బైరెడ్డిపల్లె మండలానికి చెందిన ఇద్దరు సహకారం అందిస్తున్నట్లు చెబుతున్నారు. కర్ణాటక సరిహద్దులో పలమనేరు రేంజి పరిధిలోని బైరెడ్డిపల్లె మండలం ఆలప్పల్లి కొత్తూరు సమీపంలో పొలం వద్ద ఉన్న ఒక రైతుకు చెందిన ఇంటిలో దాచి వుంచిన రూ.50 లక్షల విలువ చేసే ఎర్రచందనం దుంగలను పట్టుకొన్నట్లు పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు రేంజర్ నారాయణ, సిబ్బందితో కలిసి వెళ్లి దాచి వుంచిన 144 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.ఎంతో కాలంగా ఎర్రచందనం ఇక్కడ నిల్వచేసి అదను చూసి బెంగళూరు, చెన్నై నగరాలకు రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. తిరుపతి నుంచి చెన్నై వెళ్లే రహదారులపై పోలీసు, అటవీశాఖ అధికారుల నిఘా ఎక్కువగా వున్నందున స్మగ్లర్లు బైరెడ్డిపల్లె మండలాన్ని స్టాక్ పాయింట్‌గా ఎంపిక చేసుకోవడంతో పాటు ఇక్కడి ప్రముఖుల సహకారాన్ని కూడా పొందారని అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు.గతంలో అక్రమ రవాణాకు పేరుగాంచిన వ్యక్తే ఇక్కడా ముఖ్యుడై వుండవచ్చన్న కోణంలో కూడ అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలుస్తోంది. బైరెడ్డిపల్లె మండలం అటు కర్ణాటకకు, ఇటు తమిళనాడు సరిహద్దుకు అత్యంత సమీపంలో వుంది. కేవలం ఒక కిలోమీటరు వెళ్తే పొరుగురాష్ట్రాల్లోకి చేరే అవకాశం ఉన్నందున మద్యం, ఇసుక, స్మగ్లర్లకు ఈ మండలం అత్యంత సౌకర్యవంతంగా వుంది. అందువల్లే ఇక్కడకు వచ్చే పోలీసు పోస్టింగ్‌లకు గట్టిపోటీ వుంటోంది.

ఆడుదాం.. ఆంధ్ర అవినీతి అంతులేనంత!



ఉమ్మడి జిల్లాలో రూ.1.10 కోట్ల దుర్వినియోగం ● ముగిసిన విజిలెన్సు విచారణ

ఆడింది 47 రోజులు. ఖర్చుపెట్టింది రూ.ఐదారు కోట్లు. దుర్వినియోగమైనట్లు విజిలెన్సు అధికారులు గుర్తించింది రూ.1.10 కోట్లు. ఇదీ 'ఆడుదాం- ఆంధ్ర' లెక్క

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం.. ఆంధ్ర' అన్నారు. అవినీతి క్రీడకు తెరతీశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.1.1 కోట్ల స్వాహాకు పథకం వేశారు. ఇదంతా విజిలెన్సు విచారణలో వెలుగు చూసినట్లు తెలిసింది. గతేడాది సార్వత్రి ఎన్నికలకు ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విజిలెన్సు విచారణకు ఆదేశించింది. తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో దాదాపు 10 మంది అధికారులు నగరి నియోజకవర్గం నుంచీ విచారణ మొదలు పెట్టి జిల్లా మొత్తం సమగ్రంగా పూర్తి చేశారు. క్రీడా పోటీలకు సంబంధించి పరికరాలు, టీ షర్టుల కొనుగోళ్లు, విజేతల ఎంపికలో అక్రమాలు, పబ్లిసిటీ కోసం ఆయా వస్తువులపై బ్రాండెడ్ స్టిక్కర్లు, క్రీడాకారులకు నాసిరకం కిట్లు సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిసింది. అలాగే, విజేతలుగా కూడా వైసీపీ కార్యకర్తలనే ఎంపిక చేసినట్లు అధికారులు గుర్తించారు. వివిధ క్రీడల కింద క్రీడాకారులు ఆటలు ఆడినట్లు లెక్కలు చూపించినట్లు సమాచారం. దీంతో పాటు జిల్లా క్రీడా సంఘాల నుంచి ఖర్చు చేసిన మొత్తం కూడా ఈ స్కాం కిందకు వస్తుందని టీడీపీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆ దిశగానూ విజిలెన్సు అధికారులు విచారించారు. ఇక, ముగింపు ఉత్సవాల సందర్భంగానూ నిధుల దుర్వినియోగంపైనా దృష్టి పెట్టారు. ఇలా అన్ని కోణాల్లో విచారించిన అధికారులు.. సుమారు రూ.1.10 కోట్లు దుర్వినియోగమైనట్లు నిగ్గు తేల్చినట్లు సమాచారం. కర్నూలు విజిలెన్సు విభాగం ద్వారా ప్రభుత్వానికి రెండు రోజుల్లో ఈ నివేదిక అందించనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత ప్రభుత్వం కేసులు నమోదు చేసే అవకాశాలున్నాయి.

మెగా డీఎస్సీ ఫలితాలొచ్చాయ్!

రెండు రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ

ఆపై కేటగిరి వారీగా తుది ఫలితాల వెల్లడి



చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ సోమవారం రాత్రి విడుదల చేసింది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే దాదాపు 1478 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు జూన్ 5వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు చిత్తూరులో నాలుగు, చెన్నైలోని మరో నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 1478 పోస్టులకు 26,501మంది అభ్యర్థులు 45,221 దరఖాస్తులు పంపారు. సకాలంలో ఫీజు చెల్లించకపోవడం, నమోదులో లోపాలు, అర్హత లేకపోవడం, ఇతరత్రా కారణాలతో 2701 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా 23,500 మంది అభ్యర్థులు తేలారు. పరీక్షలు దగ్గపడే సమయానికి మరిన్ని కారణాలతో 2160 మంది అభ్యర్థులు పరీక్షలకు దూరం కాగా, చివరకు 21,340 మంది అభ్యర్థులు పరీక్షలకు అర్హత సాధించారు. ఇదిలా ఉండగా జూలై 3వ తేదీ వరకు సాగిన డీఎస్సీ పరీక్షల్లో 19,550 మంది హాజరయ్యారు. ప్రతి పరీక్ష అనంతరం రెండు రోజుల్లో 'కీ'ని విడుదల చేయగా, ఏడు రోజుల అనంతరం ఫైనల్ 'కీ' విడుద చేశారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో సోమవారం రాత్రి డీఎస్సీలో అభ్యర్థులు సాధించిన మార్కుల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అభ్యంతరాలు స్వీకరించేందుకు రెండు రోజులు గడువు ఇచ్చింది. ఈ ప్రక్రియ ముగియగానే కేటగిరి వారీగా మెగా డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేయనున్నారు.





మూతపడ్డ ఇల్లు - గతనెల, ఈనెల విద్యుత్ బిల్లులు

మూతపడిన ఇంటికి రూ.28,438 కరెంటు బిల్లు!

వెదురుకుప్పం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మూతపడిన ఇంటికి ఏకంగా నెలకు రూ.28438 కరెంటు బిల్లు వచ్చింది. ఈ ఘటన కార్వేటినగరం మండలంలో వెలుగు చూసింది. మండలంలోని టీకేఎంపేట గ్రామ పంచాయతీ ఎగువ రాజులకండ్రిగ గ్రామంలో ఓఇంటికి సర్వీసు నెంబరు-5634321000288తో ఉంది. ఆ ఇంటి యజమాని పేరు ఎన్.సుబ్బమ్మ. ఆమె కొన్నేళ్ల కిందటే చనిపోయింది. ఆమె వారసుడు దామోదరరాజు బెంగళూరులో స్థిరపడ్డారు. ఈ ఇంటిని ఆయన మూతవేసి ఉన్నారు. ఈ ఇంటి విద్యుత్ బిల్లును పక్కింట్లో ఉన్న బంధువు వద్ద నెలనెలా ఇస్తారు. ఈ విధంగా 3.6.2025 నుంచి 3.7.2025వ తేదీ వరకు రూ.64 విద్యుత్ బిల్లు వచ్చిందని, మిగులుగా రూ.172 ఉందని చూపించారు. వినియోగించిన విద్యుత్ యూనిట్లు శూన్యంగా ఉంది. అయితే 3.7.2025 నుంచి 3.8.2025 తేదీవరకు అదే సర్వీసులో 3030 యూనిట్లు వినియోగించారని, దానికోసం రూ.28438 బిల్లు చెల్లించాలని, దీనిలో మిగులుగా ఉన్న రూ.172 తగ్గించి రూ.28266 కట్టాలని విద్యుత్ బిల్లు వచ్చింది. దీన్నిచూసిన వారంతా షాకయ్యారు. ఈ విషయం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఏం జరిగిందనేది విద్యుత్ శాఖ అధికారులు తేల్చాల్సి ఉంది.

కాణిపాకంలో వేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఈనెల 27వ తేదీనుంచి నిర్వహించనున్న వరసిద్ధుడి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లను ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో వేగంగా చేస్తున్నారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ కోసం అవసరమైన వస్తువులు, పరికరాలను తీసుకొచ్చారు. ప్రధాన ఆలయం వెనుక వైపు ఉన్న గోపురానికి రంగులు వేస్తున్నారు. త్వరలో కాణిపాకం పూర్తిగా వివిధ రకాల ఆర్చిలను ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలను ఇంజనీరింగ్ శాఖ చేపట్టింది. మరో పది, పన్నెండు రోజుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడానికి ఆలయంలోని అన్నిశాఖల అధికారులు కృషి చేస్తున్నారు.



విద్యుద్దీపాలంకరణ కోసం చేస్తున్న ఏర్పాట్లు



ఆలయ గోపురానికి రంగులు వేస్తున్న శ్రామికులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

బీజేపీ శ్రేణులకు మాధవ్ పిలుపు





ఛాయ్‌పే చర్చా కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడుతున్న మాధవ్ - 60 మీటర్ల త్రివర్ణ పతాకంతో తిరంగా ర్యాలీ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ క్షేత్రస్థాయి నుంచి బలోపేతం కావడంలో భాగంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల నుంచి పార్టీ పోటీ చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచించారు.సోమవారం చిత్తూరు వచ్చిన ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు.కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న లబ్ధిని వివరించాలన్నారు. ఈనెల 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏటా ఇచ్చే రూ.10 లక్షల కోట్లు వైసీపీ ప్రభుత్వంలో పక్కదారి పట్టాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు,ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు రాజన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర చౌదరి, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మహిళా మోర్చా నాయకురాలు నిషిధారాజు, జోనల్ ఇన్‌చార్జి బిట్రా శివనానారాయణ, జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్, రమేష్‌నాయుడు, రామచంద్రుడు, రామచంద్ర, రాజేంద్ర, బాబు, ఈశ్వర్, రెడ్డిప్రసాద్,షణ్ముగం, రామభద్ర, గుత్తా ప్రభాకర్, రవికుమార్, బాబు, చిట్టిబాబు, గోకుల్ యాదవ్, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సోమవారం చిత్తూరుకు రాగా పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి.దుర్గా హోటల్ సర్కిల్‌లో ఛాయ్‌పే చర్చాలో పాల్గొని స్థానికులతో ముచ్చటించారు.మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.కేంద్రీయ విద్యాలయంతో పాటు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మాధవ్ చిత్తూరును అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం కలెక్టర్ బంగ్లా సర్కిల్‌లోని కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కట్టమంచిలోని వివేకానంద విగ్రహం నుంచి తిరంగా ర్యాలీని ప్రారంభించారు. కోర్టు సర్కిల్, హైరోడ్డు మీదుగా సాగిన ర్యాలీ గాంధీ విగ్రహ సర్కిల్ చేరుకుంది. 60 మీటర్ల పొడవైన త్రివర్ణ పతాకాన్ని విద్యార్థులు చేతపట్టి ర్యాలీలో సాగారు.

యువకుడి దారుణ హత్య





విజయ్‌కుమార్ (ఫైల్ ఫొటో), మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

యాదమరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. సీఐ శ్రీధర్ నాయుడు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని 155 కమ్మపల్లె పరిధిలోని గుట్టకింద ఊరు రఘునాథరెడ్డి పొలాన్ని బోదగుట్టపల్లె పంచాయతీ తొట్టిగాని ఇండ్లు గ్రామానికి చెందిన సదాశివం కుమారుడు విజయకుమార్ (26) కుటుంబం కౌలుకు తీసుకుని సాగు చేస్తోంది. తొట్టిగాని ఇండ్లులోని బంధువుల ఇంట్లో ఆదివారం సాయంత్రం భోజనం చేసి కౌలుకు తీసుకున్న పొలం వద్దకు విజయకుమార్ వెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో ఏమో.. సోమవారం ఉదయం పనసచెట్టుకు ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. శరీరంపై గాయాలుండటంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, తవణంపల్లె ఇన్‌చార్జి ఎస్‌ఐ చిరంజీవి తమ సిబ్బందితో కలసి పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. మృతుడి తలపై గాయాలతో పాటు, పొలంలో అక్కడక్కడా రక్తపుమరకలు కనిపించడంతో హత్యచేసి చెట్టుకు వేలాడదీసినట్లు పోలీసులు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో హత్య కేసుగా నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జిల్లా అంతటా విస్తృతంగా వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కారణంగా జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో తేలికపాటి నుంచి విస్తృతంగా వర్షాలు కురిశాయి. నగరిలో అత్యధికంగా 72.4 మి.మీ, బంగారుపాళ్యంలో అత్యల్పంగా 3.2 మిమీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. జీడీ నెల్లూరులో 68.2, చిత్తూరు రూరల్‌లో 51.8, చిత్తూరు అర్బన్‌లో 50.4, ఐరాల, గుడిపాలలో 50.2, పూతలపట్టులో 49.2, కార్వేటినగరంలో 46.2, సదుంలో 40.2, రొంపిచెర్లలో 37.2, సోమలలో 34.6, నింద్రలో 32.2, యాదమరిలో 32, విజయపురంలో 30.4, పెనుమూరులో 18, చౌడేపల్లెలో 16.2, ఎస్ఆర్‌పురంలో 14.2, పెద్దపంజాణిలో 12.2, గుడుపల్లెలో 11.5, రామకుప్పంలో 10.6, పుంగనూరులో 9.8, వెదురుకుప్పంలో 9.4, తవణంపల్లెలో 8.2, కుప్పంలో 8, గంగవరంలో 7.4, బైరెడ్డిపల్లెలో 6.6, పాలసముద్రంలో 6.2, వి.కోటలో 5.6, పలమనేరులో 5, పులిచెర్లలో 4.6, శాంతిపురంలో 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

బోనమంద సమీపంలో ఒంటరి ఏనుగు సంచారం

సోమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పేటూరు పంచాయతీ బోనమంద సమీపంలో ఒంటరి ఏనుగు సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. బోనమంద సమీపంలో రెండు రోజులుగా తిరగాడుతున్న ఒంటరి ఏనుగు సోమవారం మధ్యాహ్నం దుర్గంకొండ రోడ్డు మార్గానికి సమీపంలోని మామిడి తోటలో సంచరించడాన్ని గొర్రెల కాపర్లు గుర్తించారు. వెంటనే గొర్రెలు, మేకల మందతో వెళ్లిన గ్రామస్తులు పరుగున ఇళ్లకు చేరుకున్నారు. 15 రోజుల క్రితం కొత్తూరు సమీపంలో 16 ఏనుగులు సంచరించి రామకృష్ణమరాజుపై దాడి చేసి బలిగొన్న సంగతి తెలిసిందే. మళ్లీ ఏనుగులు తమ గ్రామాల వైపు వస్తాయేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు విండోలకు పాలకవర్గాలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు అఫిసియల్ పర్సన్ ఇన్‌చార్జిల పాలనలో కొనసాగిన నాలుగు సింగిల్‌విండోలకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ విండోలవారీగా.. గంగాధరనెల్లూరుకు చైర్మన్‌గా మోహన్ నాయుడు, సభ్యులుగా ఇమ్మానుయేలు, జ్యోతి యాదవ్ మండడి, చవటగుంటకు చైర్మన్‌గా బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సభ్యులుగా బీఎం రవి, మనోహర్, పలమనేరుకు చైర్మన్‌గా కె.వెంకటరమణ, సభ్యులుగా పాపిరెడ్డి, రమేష్, రొంపిచెర్లకు చైర్మన్‌గా పి.రఘునాథరెడ్డి, సభ్యులుగా శివారెడ్డి, సురేంద్రలను ప్రభుత్వం నియమించింది.

క్వారీల తనిఖీ



వి.కోటలో క్వారీలను పరిశీలిస్తున్న అధికారులు

వి.కోట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలో నడుస్తున్న క్వారీలను రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేశారు.పలమనేరు మైనింగ్ అధికారులతో కలసి తహసీల్దార్ ఉదయ్ సంతోష్, సీఐ సోమశేఖర్‌రెడ్డిలు కలసి రోజంతా కంకర, జల్లి ఫ్యాక్టరీలు, ఇతర గ్రానైట్ క్వారీలను సందర్శించారు. మండల పరిధిలో 14 చోట్ల క్వారీలకు అనుమతులు పొందగా, కొన్ని చోట్లే పనులు జరుగుతున్నట్లు గుర్తించారు. నడుస్తున్న క్వారీలకు అన్ని అనుమతులు ఉన్నాయా.. లేదా.. అని పరిశీలించారు. బంగ్లా ఊరు, ముదరందొడ్డి, తోటకనుమ, గోనుమాకులపల్లె, యాలకల్లు, కుంభార్లపల్లె, కృష్ణాపురం గ్రామాల వద్ద నడుస్తున్న క్రషర్లు, క్వారీలను పరిశీలించారు. పనులు నడుపుతూ ఆపిన క్వారీలు అనధికారకంగా నడుస్తున్నాయా అని పరిశీలించారు. 14 చోట్ల అనుమతులు ఉంటే కేవలం 6 చోట్ల మాత్రమే క్వారీలు నడుస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు తహసీల్దార్ ఉదయ్ సంతోష్ తెలిపారు. సోదాలో మైనింగ్ టీఏ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ మోహన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుడా పరిపాలనాధికారిగా శైలజ

తిరుపతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిపాలనాధికారిగా డాక్టర్ ఎన్.శైలజ నియమితులయ్యారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా యాదమరిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ నుంచి డెప్యుటేషన్‌పై మున్సిపల్ పాలనా శాఖకు బదిలీ చేస్తూ తుడా పరిపాలనాధికారిగా నియమించింది. సంబంధిత పోస్టులో ఆమె ప్రాథమికంగా ఏడాది పాటు కొనసాగనున్నారు. మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుమలలో 16న గోకులాష్టమి ఆస్థానం

● మరుసటి రోజు ఉట్లోత్సవం

తిరుమల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామిని సాక్షాత్తు ద్వాపరయుగపురుషుడైన శ్రీకృష్ణుడిగా స్మరించుకుని ఈనెల 16వ తేదీన శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తిరుమలలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంగారు సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని వేంచేపు చేసి నివేదినలు సమర్పిస్తారు. ఉగ్రశ్రీనివాస మూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, కృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధనం చేపడతారు. 17వ తేదీన తిరుమలలో ఉట్లోత్సవాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఈ ఉత్సవాన్ని తిలకించడానికి మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడవీధుల్లో విహరిస్తారు. ఆలయం ముందు యువకులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని ఉట్లను కొడతారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని 17వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,628

తలనీలాలు సమర్పించినవారు: 30,505

● నేడు ఏనుగుల దినోత్సవం

గజరాజుకు రక్షణ ఏదీ?

● అంతరిస్తున్న అడవులతో ఆవాసాలకు దూరం



ఏనుగు బతికినా పదివేలే.. చనిపోయినా పదివేలే అంటారు. బతికితే గజరాజులా బతకాలని కూడా చెబుతారు. ఎందుకంటే ఏనుగు తెలివైన జంతువే కాదు. స్వేచ్ఛా జీవి కూడా.. సమూహంగా ఉంటూ నాయకత్వం చాటుకుంటుంది. కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న తోటి ఏనుగును ఇట్టే గుర్తు పడుతుంది. ప్రయాణించిన మార్గాన్ని ఎప్పటికీ మర్చిపోదు.. పిల్లలతో ఉన్నపుడు దాని దగ్గరకు వెళ్లాలంటే పులులు, సింహాలే వెనుకడుగేస్తాయి...ఇన్ని విశిష్ట లక్షణాలున్నఏనుగు ఆవాసానికి క్రమేపీ చోటు కరువవుతోంది. ఏనుగుల దినోత్సవం(మంగళవారం) సందర్భంగా ప్రత్యేక కథనం.

- మంగళం, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శేషాచల కొండల్లో వందకుపైగా ఏనుగులు ఉన్నట్లు ఫారెస్ట్ అధికారుల అంచనా. గత పదేళ్లలో తిరుపతి పరిసర అటవీప్రాంతాల్లో ప్రమాదవశాత్తూ నాలుగు చనిపోయాయి. కొన్నాళ్లుగా ఇక్కడి అటవీప్రాంతంలో ఆవాసానికి అనువైన పరిస్థితులు కొరవడుతున్నాయి. అడవులను నరికివేయడం, ఆక్రమించి వ్యవసాయం చేయడం, కొన్నిచోట్ల ఎర్రచందనం కోసం స్మగ్లర్లు అలజడి సృష్టించడం లాంటి కారణాలతో ఏనుగులు బయటకు వస్తున్నాయి. సమీపంలో నీరు,ఆహారం కోసం దాడులు చేస్తున్నాయి. పంటపొలాలను ధ్వంసం చేస్తున్నాయి. రైతులను నష్టపరుస్తున్నాయి. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీటిని తిరిగి అరణ్యమార్గం పట్టించడం అధికారులకు సవాలుగా మారుతోంది. ఈనేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను రప్పించింది. వీటి నిర్వహణపై ఇక్కడి సిబ్బందికి శిక్షణ కూడా ఇప్పించింది. పలమనేరు మండలంలో ప్రస్తుతం ఈ కుంకీలు తమ పనిని ప్రారంభించాయి. గుంపులుగా ఉన్న ఏనుగులను ఒడుపుగా అడవిలోని పంపేందుకు శ్రమిస్తున్నాయి..

ప్రత్యేక టాస్క్‌ఫోర్సు

ఏనుగుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్సును కూడా ఏర్పాటు చేసింది. ఇందులోఎఫ్ఆర్వో డీఎఫ్‌వో పర్యవేక్షణలో పదిమంది సిబ్బంది, ఇద్దరు పరిశోధకులు, పనిచేస్తున్నారు. ఉనికి గుర్తించేందుకు జీపీఎస్, డ్రోన్లు, ట్రాప్ కెమెరాలు ఉపయోగిస్తున్నారు. వాటి ఆవాసాలను సంరక్షించడం, అడవుల్లో నీటితొట్టెలు ఏర్పాటుచేయడం, పంట పొలాలకు వచ్చినపుడు సురక్షితంగా తిరిగి మళ్లించడంలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జాతీయ కమిటీ పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించింది. కారిడార్ల ద్వారా ప్రత్యేక రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.



కీరమంద ప్రాంతానికి కుంకీలను తరలిస్తున్న మావటీలు

జూపార్కులోనూ ఉన్నాయోచ్

తిరుపతి ఎస్వీ జూపార్కులో ఐదు ఏనుగులను సంరక్షిస్తున్నారు. వీటిలో 3మగవి, రెండు ఆడవి. వీటికి రోజుకు రూ.2,350, వారానికి రూ.16,450, నెలకు రూ.70,500 ఖర్చు చేస్తున్నారు. వీటి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలంటే దత్తత తీసుకునే అవకాశం ఉందని జూ అధికారులు చెబుతున్నారు.



నక్కలవారికండ్రిగ పేదలు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పేదలు సాగుచేసుకుంటున్న భూములను వారికే పంపిణీ చేయాలి

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

చిల్లకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నిరుపేద దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ మిగులు భూములను పేదలకే పంపిణీ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం మండలంలోని నక్కలకాలవ కండ్రిగ వద్ద నిరుపేద దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ నెలబల్లిరెట్టపల్లి పంచాయతీలోని నక్కలకాలువ కండ్రిగ వద్ద ఉన్న సుమారు 45 ఎకరాల ప్రభుత్వ భూములను 22 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం కొందరు టీడీపీ నాయకులు నిరుపేదలపై అక్రమ కేసులు పెడుతూ భూములను అక్రమించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ఆ భూములను పేదలకు కేటాయించే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, సీపీఆర్ కుమార్, నారాయణ, రమేష్, సునీల్, శ్రీనివాసమూర్తి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మా ఊర్లోనే పాఠశాల ఉండాలి

● తడ దళితవాడ విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో మల్లికార్జునరావు

తడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తమ ఊర్లోనే పాఠశాలను కొనసాగించాలని తడ దళితవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాలను మూసివేసి అక్కడే ధర్నా చేపట్టారు. ఎంఈవో మల్లికార్జున్ పాఠశాల వద్దకు చేరుకొని తల్లిదండ్రులతో చర్చించారు. గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకువెళ్లారు. మా ఊర్లోనే పాఠశాలను కొనసాగించేలా చూడాలని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే డీఈవో కుమార్‌తో చర్చించారు. ఇందుకు ఆయన సానుకులంగా స్పందించారు. తడ దళితవాడ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి వరకు చదువుకునేలా విద్యాశాఖ అధికారులు అంగీకరించినట్లు తమకు హామీ లభించిందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ విషయమై ఇంత వరకు తగిన ఆదేశాలు రాలేదని, ఉన్నతాధికారుల సూచన ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో మల్లికార్జున్ చెప్పారు.

భానుప్రకాష్‌రెడ్డికి పలువురి పరామర్శ



భానుప్రకాష్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నేత భానుప్రకాష్‌రెడ్డిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన తల్లి గుడుపల్లి అరుణమ్మ (80) ఆదివారం మృతిచెందిన విషయం విదితమే. సోమవారం పలువురు ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళుర్పించారు. భానుప్రకాష్‌రెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఇందులో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి, చంద్రగిరి, నగరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, మురళి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, బత్తల చెంగల్రాయులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, డీఆర్‌డీఓ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, శాప్ చైర్మన్ రవినాయుడు, టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్రనారాయణ, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్, టీడీపీ నేతలు భువన్‌కుమార్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గోవిందధామంలో దహనక్రియలు నిర్వహించారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

డక్కిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డక్కిలిలో ప్రభుత్వాస్పత్రి ఎదురుగా నడుపుతున్న ఆర్ఎంపీ క్లినిక్‌ను సోమవారం అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారిణి బిందుప్రియ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వంద మీటర్లు దూరం వరకు ఎలాంటి ప్రైవేట్ వైద్యశాలలు ఉండకూడదన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఏప్రిల్‌లోనే ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశామన్నారు. అయితే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు కావడంతో తరుపరి చర్యలు తీసుకోలేదన్నారు. హైకోర్టు ఆ కేసు కొట్టివేయడంతో ఈనెల 7న క్లినిక్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. గడవు ముగిసినా నిబంధనలు పాటించక పోవడంతో సోమవారం క్లినిక్‌ను మూసివేయించినట్లు వివరించారు. కార్యక్రమంలో వెంకటగిరి సీఐ రమణ, డక్కిలి, బాలాయపల్లి ఎస్ఐలు శివశంకర్, కామినేని గోపి, వైద్యాధికారి శ్రీహరి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎంపీ క్లినిక్ వద్ద అధికారులు

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్టు



కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని దేవళంపేట, కమ్మపల్లి పంచాయతీలో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు దాడులతో పంటలకు అపారనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతల వంక నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ కుమ్మరపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు రవికి చెందిన కొబ్బరిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి హంద్రీ-నీవా కాలువ మార్గంలో గెండేవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా కమ్మపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి సమీపానికి చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, నరసింహారెడ్డి, హైమావతి, వెంకటరెడ్డికి చెందిన మామిడి, కొబ్బరి, అరటి, పనస, వేరుశనగ, వంకాయ పంటలను ధ్వంసం చేశాయి. దేశిరెడ్డిగారిపల్లిలోని రైతులు జయచంద్రారెడ్డి, జగదీష్‌రెడ్డి, రవీంద్రారెడ్డికి చెందిన వరి, అరటి, మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి వచ్చిన మార్గంలోనే అడవిలోని బోడబండ వద్దకు చేరుకున్నాయి. సోమవారం పగలంతా ఏనుగుల గుంపు బోడబండ వద్ద తిష్ట వేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో మధు తెలిపారు.

పాఠశాలల్లో పిల్లలకు నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

చిత్తూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పిల్లల కడుపులో నులిపురుగుల నివారణకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను మింగించనున్నారు. జిల్లాలోని మొత్తం 5466 పాఠశాలలు, కళాశాలల్లో 3,62,535మంది విద్యార్థుల చేత మధ్యాహ్న భోజనం తర్వాత ఈ మాత్రలు మింగించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ జాయింట్ డైరెక్టర్ సునీల్ నాయక్ తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లతో ఈ విషయమై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం వీడియోకాన్ఫరెన్స్‌లో అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు.

అప్పుల బాధ తాళలేక యువ రైతు ఆత్మహత్య



యాదమరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అప్పులు బాధ తాళలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని తెల్లరాళ్లపల్లె పంచాయతీ రంగనాయకపురం గ్రామానికి చెందిన గోవిందరాజులు కుమారుడు కల్యాణ్ కుమార్(24) వ్యవసాయం చేసుకునే జీవనం సాగించేవారు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పుల బాధ తట్టుకోలేక సోమవారం సాయంత్రం అతని ఇంటి గుమ్మానికి చీరతో ఉరేసుకున్నాడు. పొలం నుంచి ఇంటికి వచ్చిన తండ్రి చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారొచ్చి పరిశీలించగా, అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలో విచారించి మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'స్త్రీశక్తి' మార్గదర్శకాలు జారీ

వెదురుకుప్పం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. చంద్రన్న కానుకగా స్త్రీశక్తి పథకం మహిళల ముంగిటకు ఈనెల 15వ తేదీన వచ్చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు రకాల (పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్) బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుంది. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు బస్సుల్లో తగిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా కండక్టరుకు చూపించి తమ ప్రయాణాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగించే వెసులుబాటు ఉంది. తిరుపతి-తిరుమల మధ్య వెళ్లే సప్తగిరి బస్సుల్లో ఉచిత ప్రయాణం కుదరదని తేల్చేశారు. ఇతర రాష్ట్రాలు, నాన్ స్టాప్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. బస్సుల్లో రద్దీ పెరగనున్న నేపథ్యంలో తగిన చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలిచ్చారు. అంతేకాదండోయ్ బస్సు కండక్టర్లకు సైతం బాడీ ఓర్న్ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈమేరకు ఆర్టీసీ ఎండీకి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేశారు.





జలపాతాల కొండ

ఉండి ఉండీ దంచిపోస్తున్న వానలకు తిరుమల కొండల్లో జలపాతాలు ఉరికి దూకుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచే కపిలతీర్థం ఉధృతంగా ప్రవహిస్తుండగా, సోమవారం ఉదయానికి మాలాడగుండం కూడా జాలువారుతోంది. గరుడవారధి మీద తిరుమలకు ప్రయాణించే వాహనాల్లోని యాత్రికులకు ఈ జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. కపిలతీర్థంకి జనం పోటెత్తి వస్తున్నారు. ఇక్కడ నిలిపేస్తున్న వాహనాలతో నంది సర్కిల్‌లో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలుగుతోంది. దివ్యారామం కొలను ముందు ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.







‘పీజీఆర్‌ఎస్’ లేదన్నా.. వచ్చారు..!

● కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరించిన డిప్యూటీ కలెక్టర్


అర్జీలివ్వడానికి క్యూకట్టిన బాధితులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం సోమవారం నిర్వహించడంతో కలెక్టరేట్‌లో రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించారు. అయినా అర్జీదారులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. దాంతో కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్, జేసీ లేకపోవడంతో పలువురు నిరాశగా వెనుతిరిగారు.

పోలీసుశాఖకు 45 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబు వినతిపత్రాలను స్వీకరించారు. నిర్ణీత సమయంలోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 45 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. భూ తగాదాలపై 16, కుటుంబ తగాదాలపై 9, డబ్బు తగాదాలపై 8, ఇంటి తగాదాలపై 6, వేధింపులపై 3, దారి తగాదాలపై 2, చీటింగ్‌పై ఒకటి చొప్పున ఉన్నాయి.

క్రీడాకారిణికి అమర్ అభినందనలు


పలమనేరుకు చెందిన రగ్బీ క్రీడాకారిణి అక్షయ

పలమనేరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన రగ్బీ క్రీడాకారిణి అక్షయకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. బిహార్ వేదికగా ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన ఏషియా రగ్బీ ఎమిరేట్స్ అండర్-20 ఛాంపియన్ షిప్‌లో పలమనేరు శ్రీనగర్ కాలనీకి చెందిన నర్రా సురేష్, శ్రీదేవిల కుమార్తె అక్షయ భారత జట్టు తరపున ఆడి కాంస్య పతకం సాధించింది. ఇది ఎంతో గర్వించదగ్గ విషయమని అమరనాథరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఛాంపియన్ షిప్‌లో అక్షయ కనబరచిన ప్రదర్శనపట్ల ఆమెకున్న ఆసక్తిని, ఆకాంక్షను తెలియజేస్తుందన్నారు. పట్టుదల, కఠోర శిక్షణ ప్రతిభకు నిదర్శనంగా నిలిచిన అక్షయ నేటి యువతరానికి ఆదర్శమని, భవిష్యత్తులో మరింత అత్యుత్తమంగా రాణించి ఈ ప్రాంతానికి పేరుతీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.

‘దీపం’ డబ్బుల వివరాలు చెబుతామంటూ మోసం



అమినిగుంటలో బాధితులకు డబ్బులు తిరిగి ఇస్తున్న శ్రీనివాసులు నాయుడు

చౌడేపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దీపం పథకం డబ్బులు మీకు పడ్డాయా లేదా అనే వివరాలు చెబుతామని మహిళలను మోసం చేసిన సంఘటన మండలంలో సోమవారం జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని అమినిగుంట పంచాయతీలోని అమినిగుంట, బురగపల్లె గ్రామాల్లో మీకు ప్రభుత్వం అందిస్తున్న దీపం గ్యాస్ డబ్బుల వివరాలు చెక్ చేసి చెబుతామని 8 మంది వ్యక్తులు ప్రతి ఇంటికి వెళ్లి ఒక్కో మహిళల వద్ద రూ.150 చొప్పున వసూలు చేశారు. మేము చెక్ చేసి అప్‌లోడ్, సర్వీస్ చేస్తేనే మీకు గ్యాస్ డబ్బులు, బీమాలు వస్తాయని, లేకపోతే రావని ఇంటింటికి వెళ్లి చెప్పి డబ్బులు వసూలు చేశారు. ఈ విషయాన్ని కొంతమంది టీడీపీ నేత, బోయకొండ కమిటీ మాజీ సభ్యులు శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన వారిని విచారించి, మోసం చేస్తున్నారని గుర్తించి, వారి నుంచి డబ్బులు తిరిగి ఇప్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలెవరూ ఇలా మోసపోవద్దని అవగాహన కల్పించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఈ నగదును దాత పులిచెర్ల హెచ్‌పీ పెట్రోల్ బంకు యజమాని వసంతమ్మ అందజేశారు. 560 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని రమ్యకు రూ.5వేలు, 539 మార్కులతో రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థిని రక్షితకు రూ.3వేలు, 534 మార్కులతో మూడవ స్థానంలో నిలిచిన విద్యార్థిని రెడ్డిశ్రావణికి రూ.2వేలు నగదు బహుమతి అందజేశారు. సీఈవో రవికుమార్, ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకట్రమణ, తహశీల్దార్ జయసింహ, ఎంఈవో శిద్దరామయ్య, హెచ్ఎం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అప్పులబాధతో మెస్ యజమాని ఆత్మహత్య


మృతిచెందిన శ్యామ్‌కుమార్

గంగవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక మెస్ యజమాని మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గంగవరం సాయినగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్ మెస్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మెస్ నిర్వహణ కోసం పరిచయం ఉన్న కొందరి దగ్గర అప్పులు తీసుకున్నాడు. మెస్‌లో జరిగే వ్యాపారానికి, ఖర్చులకు సరిపోతుండడంతో అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోయాడు. దీంతో అప్పులిచ్చిన వారి వేధింపులకు మనస్థాపం చెందిన శ్యామ్‌కుమార్ మెస్ మిద్దెపైన కిటికీకి చీరతో ఉరివేసుకొని మృతిచెందాడు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలను విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

బాలికను పెళ్లాడిన యువకుడిపై పోక్సో కేసు

రామకుప్పం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసుకోవడమే కాక గర్భవతిని చేసి ఆపై వదిలించుకునేందుకు ప్రయత్నిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదయ్యింది.పోలీసుల కథనం మేరకు ..... రామకుప్పం మండలం రాజుపేటకు చెందిన యువకుడు మణికంఠతో కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ సమీపంలోని అండబళ్లికి చెందిన బాలిక(18)కు ఏడాది క్రితం పెళ్లయింది. గర్భవతి అయిన బాలికను ఇటీవల కాన్పు కోసం పుట్టింటికి పంపాడు. బాలిక గర్భం దాల్చిన విషయాన్ని స్థానికులు శిశు సంక్షేమ కమిటీ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చౌడప్పకు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేజీఎఫ్ అండర్‌సన్‌పేట పోలీసులు మణికంఠపై కేసు నమోదు చేశారు. ఆ జీఎఫ్ఐఆర్‌ను వారు చిత్తూరు ఎస్పీ మణికంఠకు పంపారు. ఎస్పీ ఆదేశాల మేరకు రామకుప్పం ఎస్ఐ వెంకటమోహన్ సోమవారం మణికంఠపై పోక్సో కేసు నమోదు చేశారు. కుప్పం డీఎస్పీ పార్థసారథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా నాగరాజు



చిత్తూరు రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శిగా నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 9, 10 తేదీల్లో నగిరిలో సీపీఐ జిల్లా 24వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శిగా రెండోసారి నాగరాజును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా సహాయ కార్యదర్శులుగా జనార్దన్, శివారెడ్డిలను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముగ్గురు గంజాయి దొంగల అరెస్టు

పూతలపట్టు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ముగ్గురు దొంగలను పూతలపట్టు పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల మేరకు.. పూతలపట్టు మండలం యం.బండపల్లె బస్టాప్ వద్ద సోమవారం అదే గ్రామానికి చెందిన గెవినమ్మ, ఏలూరుకు చెందిన విఘ్నేష్, మనోహరన్ చేతిలో బ్యాగులు పట్టుకుని అనుమానాస్పదంగా మాట్లాడుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో సీఐ తన సిబ్బందితో కలసి అక్కడికెళ్లారు. పోలీసులను చూసి పారిపోతున్న ముగ్గురిని పట్టుకున్నారు. పరిశీలించగా, వారి వద్ద రూ.2.15 లక్షల విలువైన గంజాయి కనిపించింది. గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

కనికరించండి సార్..!

● గజదాడుల నుంచి కాపాడాలన్న రైతులు ● పులిచెర్లలో పీజీఆర్‌ఎస్‌కు 186 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు తీస్తూ, పంటలు నాశనం చేస్తున్న ఏనుగుల దాడుల నుంచి రక్షించండి, మేము ఎదుర్కొంటున్న అనేక కష్టాలను విన్నవించాం, కనికరించి మా సమస్యలు పరిష్కరించాలని పలువురు బాధితులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు విన్నవించుకున్నారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు, బాధిత ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీనీ స్వయంగా కలెక్టర్ నేరుగా స్వీకరించారు. సమస్యలను పరిశీలించిన ఆయన వెంటనే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి నియోజకవర్గ ప్రజలకు సంబంధించి అనేక సమస్యలను బాధితుల ద్వారా వినతులు ఇప్పించి సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. పీజీఆర్‌ఎస్‌లో శాఖలవారీగా రెవెన్యూ 146, డీఆర్డీఏ-12, సివిల్ సప్లై-5, ఆధార్‌కార్డులు-4, భూనష్టపరిహారం-4, గ్రామవార్డు సచివాలయం-2, ఇరిగేషన్-2, శ్మశానవాటికలు-2, డీకేటీపట్టా-1, విద్యుత్-1, ఉద్యానశాఖ-2 జిల్లా వైద్యశాఖ-1, క్యాస్ట్ వెరిఫికేషన్-1, ఆర్‌డబ్ల్యుఎస్-1 హౌసింగ్-1, ఆర్అండ్‌బీ-1 చొప్పున 186 అర్జీలు వచ్చాయి. పీజీఆర్‌ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాలని, సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చూపొద్దని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పీజీఆర్‌ఎస్ మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగగా, మండల పరిషత్ కార్యాలయం అర్జీదారులతో కిక్కిరిసింది. పీజీఆర్‌ఎస్‌లో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపడాల్, డీఆర్వో మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెలరోజుల్లో పీజీఆర్‌ఎస్ వినతులపై ప్రత్యేక సమీక్ష: కలెక్టర్

పీజీఆర్‌ఎస్ వినతుల కార్యక్రమం అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పులిచెర్లలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీపై నెల రోజుల తర్వాత ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. రెవెన్యూ అధికారులు బృందాలుగా వినతులపై పరిశీలించి పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. అన్నిశాఖల సమస్యలు తీర్చాలని, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శ్మశానవాటికల సమస్యలు తీర్చడం, సరిహద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

గజ బాధిత రైతులను ఆదుకోవాలి



పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు దాడులతో తీవ్రంగా నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని బాధిత రైతులు కలెక్టర్‌కు వినతిచేశారు. బాధిత రైతులు రవీంద్రారెడ్డి, నారాయణ మాట్లాడుతూ మండలంలోని అటవీ సరిహద్దులోని పాతపేట, కల్లూరు, చల్లావారిపల్లి, పాళెం, దేవళంపేట, కమ్మపల్లి, ఎల్లంకివారిపల్లి, మంగళంపేట తదితర పంచాయతీల్లో ఏనుగుల దాడుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నష్టపరిహారం అంతంతమాత్రంగా అందజేస్తున్నారని, మూడేళ్లుగా కొనసాగుతున్న ఏనుగుల దాడులతో పంటల నష్టం అంచనాలకు మించిపోయిందని, అధికారులు స్పందించి ఏనుగుల దాడులను అరికట్టాలని, నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు.

చల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి



రొంపిచెర్ల మండలం గానుగచింత గ్రామంలో 2007లో నిర్మించిన చల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 2003లో ప్రాజెక్ట్ పనులు ప్రారంభించారని, 177 మంది రైతులు 210 ఎకరాల భూములను కోల్పోయారన్నారు. 2007లో ప్రాజెక్ట్ పనులు పూర్తయినా భూములు కోల్పోయిన రైతులకు నేటికీ నష్టపరిహారం అందలేదని బాధిత రైతులు వాపోయారు.

ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం

గుడుపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడివంక కొండపై వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించారు. ఆ తరువాత సుబ్రహ్మణ్యస్వామి ఆయుధాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయ కొండ కింద ఉన్న కోనేరు వద్దకు తీసుకొచ్చి గంగపూజ చేశారు. కోనేరులోని నీళ్లను వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి మూల విగ్రహానికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ వేద పండితులు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజారోహణం చేశారు. ఆలయంలో నవగ్రహ, కలశపూజలు, హోమాలను వేదపండితులు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.




ప్రత్యేక అలంకణలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి - ఆలయ కోనేరులో స్వామి ఆయుధాలకు పూజలు చేసి తీసుకొస్తున్న ఆలయ కమిటీ సభ్యులు - ఆలయంలో ధ్వజారోహణం చేస్తున్న దృశ్యం

వాహనం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం



అయ్యప్ప మృతదేహానికి గౌరవ వందనం చేస్తున్న తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు (ఇన్‌సెట్లో) అయ్యప్ప (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొన్న ఘటనలో ఓ కానిస్టేబుల్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం బీసీ కాలనీకి చెందిన వై.అయ్యప్ప (42) తిరుపతి జిల్లా పుత్తూరు టౌన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పుత్తూరు నుంచి భార్యకు ఫోన్‌చేసి తమిళనాడులోని పళ్లిపట్టుకు కేసు పనినిమిత్తం వెళుతున్నట్లు చెప్పాడు. పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారిలో బైక్‌లో వస్తుండగా కార్వేటినగరం మండలం సురేంద్రనగరం క్రాస్‌రోడ్డు దాటాక వచ్చే కనుమ వద్ద ఆదివారం రాత్రి 9.30 గంటలపైన ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిర్వహించాక సోమవారం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. వారు కార్వేటినగరానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

కుటుంబాన్ని ఆదుకుంటాం: తిరుపతి ఎస్పీ

కానిస్టేబుల్ అయ్యప్ప కుటుంబాన్ని ఆదుకుంటామని తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. సోమవారం కార్వేటినగరానికి వచ్చిన ఆయన అయ్యప్ప మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీసుశాఖ తరపున మృతుడి కుటుంబానికి రూ.లక్ష అందజేశారు. నివాళులర్పించిన వారిలో పుత్తూరు డీఎస్పీ రవికుమార్, నగరి డీఎస్పీ అజీజ్, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్ తదితరులున్నారు.

డ్రోన్ నిఘాతో తాగుబోతులపై కేసు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడంలో పోలీసులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఏఎస్పీ రాజశేఖర్ రాజు ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా డ్రోన్లతో నిఘా పెట్టారు. నిర్మానుష్య ప్రాంతాలు, పాడుబడిన భవనాలు, బహిరంగ ప్రదేశాలతో పాటు నేరాలకు అవకాశమున్న ప్రాంతాలను డ్రోన్లతో జల్లెడపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గంజాయి వినియోగం, పేకాట, చైన్ స్నాచింగ్‌వంటి వాటిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సాంబయ్యకండ్రిగ వద్ద డ్రోన్‌తో నిఘాపెట్టగా ఇద్దరు వ్యక్తులు నిర్మానుష్య ప్రాంతంలో మద్యం తాగుతూ పట్టుబడ్డారు. వారిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు హెచ్చరించారు.

మాతాశిశు మరణాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు?

టాస్క్‌ఫోర్స్ కమిటీ నోడల్ అధికారి ఆగ్రహం

చిత్తూరు రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఒక్క నెలలో 13 మాతాశిశు మరణాలు జరిగితే వైద్యాధికారులు ఏమి చేస్తున్నారని జిల్లా మాతా శిశు మరణాల టాస్క్‌ఫోర్స్ కమిటీ నోడల్ అధికారి హనుమంతరావు ఆగ్రహించారు. సోమవారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా మాతాశిశు మరణాల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జూలైలో 13 (12 శిశు, ఒక మాతా) మరణాలు జరగడం దారుణమన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. మరణాలకు కారణాలను ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కూడా కారణంగా తెలుస్తోందని కమిటీ సభ్యులు తెలిపారు. హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్యాధికారులు నోడల్ అధికారి ఆదేశించారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, గైనకాలజిస్టులు లత, ప్రశాంతి, సునంద పాల్గొన్నారు.

చదువు మళ్లీ కొనసాగించండి: కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చదువు మళ్లీ కొనసాగించండని వయోజనులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో దూర విద్యావిధానంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వివిధ వృత్తుల్లో ఉండి 50 ఏళ్ల పైబడిన వయోజనులను దృష్టిలో ఉంచుకుని దూర విద్యావిధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. దీన్ని వినియోగించుకోవాలని కోరారు. నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంపై పకడ్బందీ ప్రణాళికను సిద్ధంచేసి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. డీఈవో వరలక్ష్మి, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డ్వామా పీడీ రవికుమార్, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎన్ మాధవ్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు.సోమవారం చిత్తూరు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు.పోలవరం నీరు అందుబాటులోకి వస్తే రాయలసీమకు 50 శాతం నీటి సమస్య తీరుతుందన్నారు.అనంతపురం జిల్లాకు కియా మోటర్స్ వచ్చినట్లే చిత్తూరు ప్రాంతానికి అనేక పరిశ్రమలు రావడానికి నీటి అవసరం ఎంతైనా ఉందన్నారు.ఇక్కడి మామిడి రకాలైన బేనీషా, తోతాపురి కాయల నుంచి వచ్చే పొడికి విదేశాల్లో ఎంతో గిరాకీ ఉందన్నారు.రైతులు మామిడి పొడిని ఎగుమతి చేసే విధంగా వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మ్యాంగో సన్ డ్రైయర్ యూనిట్లు ఇచ్చేందుకు బీజేపీ కృషి చేస్తోందన్నారు.వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు విత్తనాల ప్లాంట్‌ను జిల్లాకు తీసుకురానున్నట్లు తెలిపారు.

ఆర్టీఎఫ్ ఇచ్చి కళాశాలలను ఆదుకోవాలి

● రేపు తాడేపల్లిలో శాంతియుత ధర్నా

● ఏపీపీడీసీఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల రీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజు (ఆర్టీఎఫ్) ఇచ్చి కళాశాలలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ప్రైవేటు డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోషియేషన్ (ఏపీపీడీసీఎంఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్నం సురేంద్రరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి ఆరు విడతలుగా పెండింగ్‌లోని ఆర్టీఎఫ్‌ని చెల్లించాలని కోరారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో రాష్ట్ర నాయకత్వం పిలుపుతో బుధవారం తాడేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం ముందు శాంతియుత ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో స్థానిక కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు బాలాజీ, వాసు, ప్రభు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. సోమవారం మండల కార్యాలయం ఆవరణలోని ట్రైలర్ హైస్కూల్ మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు యువతను ఉత్సాహపరిచి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం క్రీడాకారులతో కరచాలనం చేశారు. క్రికెట్ టోర్నమెంట్‌కు బహుమతులు అందించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గోపాల్, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు శ్యామల, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నాగరాజు, యూనిట్ ఇంచార్జి బాలు, టీడీపీ నేతలు రమేష్, జయరాం, హేమావతి, రూప, సరిత, వెంకటేష్, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

● కలెక్టర్‌కు విన్నవించిన చల్లా రామచంద్రారెడ్డి



పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌తో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు విన్నవించారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు చల్లా రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ప్రజలు తీసుకువస్తున్న వినతులను అడిగి తెలుసుకొని ఒక్కొక్కటిగా కలెక్టర్‌కు చల్లా రామచంద్రారెడ్డి వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తుంటాయని, మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. డ్రైనేజీలు, సిమెంటురోడ్లు, శ్మశానవాటికలకు ప్రహరీలు తదితర సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

చల్లంపల్లె ప్రాజెక్టు ముంపు భూములకు పరిహారం చెల్లించాలి



ప్రజావేదిక వద్ద నిరసన తెలుపుతున్న రొంపిచెర్ల రైతులు

రొంపిచెర్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ చల్లంపల్లె సమీపంలో గాజులేరుపై నిర్మించిన చల్లంపల్లె ప్రాజెక్టు కోసం గానుగచింత పంచాయతీకి చెందిన 26 మంది రైతులకు సంబంధించిన సుమారు 45 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. వీరికి పరిహారం అందలేదు. 14 సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులు, అధికారులకు రైతులు తమగోడు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. జయబ్బ నాయుడు, చంద్రయ్య నాయుడు, చిన్నబ్బ నాయుడు, ప్రభావతమ్మ, ఉజయని నాగేశ్వరరావు, నాగయ్య, వెంకటనాగులు, కల్లాసబ్బయ్య, ఎం.రమణయ్య, రామక్రిష్ణ తదితరులు జీవనాధారమైన భూములను నష్టపోయారు. గత ప్రభుత్వంలోనూ పరిహారం అందలేదు. దీనిపై చల్లా బాబుకు వివరించగా, ఆయన సూచన మేరకు బాధిత రైతులు సోమవారం పులిచెర్ల ప్రజావేదికలో కలెక్టరు సుమిత్‌కుమార్‌కు వినతి ఇచ్చారు. ఇందుకు స్పందించిన కలెక్టర్... ఇది నా పరిధిలో లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా సూచించినట్లు రైతులు తెలిపారు. అలాగే గానుగచింత పంచాయతీ దిగువజూపల్లె, ఎగువజూపల్లె 60 మంది రైతుల పొలాలు, వ్యవసాయ భూములు, సమీపంలో ఉన్న కొండ ప్రాంతంలో పశువులు మేపేందుకు వెళ్లే దారి సమస్యపై గ్రామానికి చెందిన రైతు ఈశ్వర నాయుడు, వెంకట్రమణ నాయుడు, నాగయ్య నాయుడు, జయబ్బ నాయుడు, చంద్రయ్య నాయుడు, బాబు తదితరులు కలెక్టరుకు వినతి అందజేసి న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా రొంపిచెర్ల తహసీల్దార్ అమరనాథ్, డీటీ సురేష్‌కుమాలను కలెక్టరు ఆదేశించినట్లు రైతులు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన పుంగనూరు నేతలు



పుంగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను పుంగనూరు బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. సోమవారం చిత్తూరులో ఆయను పుంగనూరు బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్, నాయకులు పెద్దమరం బాబు, రాజాజెట్టి, ప్రసాద్, చంద్రరాజు, వెంకటరెడ్డి, రమేశ్, ఉమాశంకర్, ఆదినారాయణ, హేమంత్ తదితరులు కలిసినట్లు తెలిపారు.



చౌడేపల్లె బీజేపీ నాయకులు

● చౌడేపల్లె: రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు మాధవ్‌ను చౌడేపల్లె బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం బీజేపీ మండలాధ్యక్షులు కడియాల మనోహర్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు చిత్తూరులో ఆయనను కలిసి శాలువలతో సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గందోడి ప్రవీణ్, నాయకులు శేఖర్‌బాబు, రెడ్డిప్ప పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

పలమనేరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం దేవదాయ శాఖ అధికారులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కించారు.హుండీలో భక్తులు కానుకల రూపంలో రూ.2,56,947లు వేసినట్టు అధికారులు తెలిపారు. దేవదాయ శాఖ డివిజన్ తనిఖీదారు పి.శశికుమార్, ఆలయ ఈవో కమలాకర్, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం తనిఖీలు

సదుం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సదుం మండలంలోని తిమ్మానాయునిపల్లె పంచాయతీలో గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులను నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం(ఎన్ఎల్ఎంటీ) సభ్యులు డా.మణికంఠ, డా.ప్రశాంత్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గత మూడేళ్లుగా జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనుల గురించి వారు లబ్ధిదారుల వద్ద ఆరా తీశారు. ఉపాధి హామీ పనులు, సామాజిక పింఛన్ల పంపిణీ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన ఇళ్లు, స్వయం సహాయక సంఘాల కార్యక్రమాల రికార్డులను పరిశీలించారు. డ్వామా అడిషనల్ పీడీ సునీల్ కుమార్, ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో హరిబాబు, ఏపీవో శ్రీనివాసులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, వీవోలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో అధ్యాపకుల నిరసన

పలమనేరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీసీటీఏ, జీసీజీటీఏ రాష్ట్రయూనియన్ జేఏసీ పిలుపు మేరకు సోమవారం భోజన విరామ సమయంలో అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. జీసీటీఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఈ.వాసు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని శాఖల్లో బదిలీలు పూర్తయినా డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు బదిలీలు చేపట్టడం లేదని, దీంతో దూరప్రాంతాల్లో ఉన్నవారు బదిలీలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధ్యాపకులు నందీశ్వరయ్య, జయశంకర్, శశికళ, షేక్ బెనర్జీ, వెంకటేష్ బాబు, బాలాజీ, నాగరత్నంరెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కావళ్ల పండుగ

రామకుప్పం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం కావళ్ల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మూడ్రోజుల నుంచి ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు ఉదయం ఇళ్లలో ప్రత్యేక పూజలు జరిపి కావళ్లను భుజాలపై ధరించారు. సాయంత్రం కావడి భజన బృందాల పాటలు, వాయిద్యాల మధ్య రామకుప్పం శివార్లలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి చేరుకుని, స్వామి వారికి కావళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



బేబి షాలిని మృతదేహం

కల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు... పులిచెర్ల మండలం పోశంవారిపల్లి పంచాయతీ గోపాలపురం ఎస్టీకాలనీకి చెందిన చంద్ర కుమార్తె బేబిషాలిని (21)ని ఇదే మండలం పగడాలవారిపల్లిలోని చంద్రయ్య కుమారుడు సుధాకర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల బేబిషాలినికి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో మనస్తాపానికి గురైంది. దీంతో గత నెల 26వ తేదీన మామిడిచెట్లకు కొట్టే పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు గమనించి పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు నాయీ బ్రాహ్మణుల సంబరాలు

కుప్పం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల వృత్తి దుకాణాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో కుప్పంలో మంగళవారం ఆ సామాజిక వర్గానికి చెందినవారు సంబరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి సభ్యుడు వైద్యం శాంతారాం తెలిపారు. కుప్పం పట్టణంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల సమర్పిస్తామన్నారు. తర్వాత ఎన్టీఆర్ విగ్రహం ఎదుటే ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి కృతజ్ఞతాపూర్వకంగా క్షీరాభిషేకం చేసిన అనంతరం సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కుప్పం రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు చెక్కునత్తం మణి, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మహిళపై హత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రియుడి చేతిలో ఓ మహిళ హత్యాయత్నానికి గురైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి పుంగనూరులో జరిగినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.... పుంగనూరు కొత్తపేటకు చెందిన రెడ్డెప్పతో రాణెమ్మకు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. నాలుగేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చి విడిపోయారు. కొంత కాలానికి మదనపల్లె మండలం అరవాండ్లపల్లెకు చెందిన వెంకటేశ్ పుంగనూరులో మేస్త్రీ పనులు చేస్తుండగా అతడితో రాణెమ్మకు పరిచయం కావడంతో అది కాస్త అక్రమ సంబంధానికి దారితీసింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం భర్త రెడ్డెప్పతో మళ్లీ మాట్లాడటం, భార్యాభర్తలు కలిసి తిరగడం మేస్త్రీ వెంకటేశ్ గుర్తించాడు. దీంతో కోపం పెంచుకున్న వెంకటేశ్ ఆదివారం రాత్రి రాణెమ్మను ఇంటి నుంచి బయటకు రమ్మని చెప్పాడు. ఆమెతో మద్యం తాగించి కత్తితో గొంతు కోసి, కడుపుపై పొడవటంతో రాణెమ్మ స్పృహతప్పి పడిపోయింది. అనంతరం వెంకటేశ్ పరారయ్యాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన రాణెమ్మను పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ తీవ్రంగా గాయపడి సోమవారం పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుంది. బాధితుల కథనం మేరకు వివరాలు... చౌడేపల్లె మండలం 29ఏ చింతమాకులపల్లె పంచాయతీ బయప్పల్లెకు చెందిన ఉమాశంకర్ భార్య నీలా(22) ఉతికిన బట్టలను మిద్దెపై ఆరవేస్తుండగా ఇంటిపై ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురైంది. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పుంగనూరు-బోయకొండ మార్గంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధితుడి కథనం మేరకు వివరాలు.... చౌడేపల్లె మండలం గూబలవారిపల్లెకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ మోహన్ పుంగనూరులో క్లినిక్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి క్లినిక్ పనులు పూర్తి చేసుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా బోయకొండ వైపు నుంచి కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో మోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయన్ను చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే జరిమానా

పుంగనూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నాణ్యత లేని, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేసి జరిమానాలు విధించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప తన సిబ్బందితో దాడులు చేసి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాదారులకు రూ.2200లు జరిమానా విధించారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

పుంగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని పుంగనూరు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని మాగాండ్లపల్లె సచివాలయం, విలేజ్ క్లినిక్‌లను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం రెండు గంటలపైన సచివాలయాల్లో లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో లేని సిబ్బందిపై ఉన్నతాధికారులు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా మునీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

సోమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లెలో నూతనంగా నిర్మించిన మునీశ్వరస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు గోపూజ, వాస్తు హోమం, పంచామృత అభిషేకం, నవగ్రహ హోమం, కళా హోమం నిర్వహించారు. అనంతరం మునీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ నిర్మాణాన్ని ఆవులపల్లె బీమా మునిరత్నం, వెంకటరత్నం, కృష్ణయ్య కుటుంబసభ్యులు చేపట్టారు.

చాముండేశ్వరి దేవి ట్రస్టు అన్నదానం

పలమనేరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం ఎగువ కూరుమాయికి చెందిన శ్రీచాముండేశ్వరి దేవి టెంపుల్ సేవా ట్రస్టు ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా అనాధలకు, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్టు ట్రస్టు చైర్మన్ రెడ్డిప్రసాద్ తెలిపారు. మొగిలి శివాలయం అన్నదాన సత్రంలో సుమారు 500 మందికి అన్నదానం చేశారు.







గాలివానకు నెర్నపల్లె వద్ద నేలకొరిగిన కాకర తోటను తొలగిస్తున్న రైతు, కుమ్మరమడుగులో వైరస్ సోకిన టమోటా తోట, యడగురిలో కోతకు గురైన రాగిపైరు

వర్షం.. అపార నష్టం

● గాలివానకు నేలకొరిగిన ఉద్యాన పంటలు

● ఆదుకోవాలని రైతుల వేడుకోలు



హోరున ప్రవహిస్తున్న కుమ్మరమడుగు వంక

వి.కోట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలో గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు రైతులకు అపార నష్టం వాట్టిల్లింది. రెండు రోజుల క్రితం కురిసిన గాలివానకు ఉద్యాన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. జూన్, జూలై మాసాల్లో కురవాల్సిన వర్షాలు అప్పుడు కురవకపోవడంతో మండలంలో కరవు ఛాయలు అలుముకున్నాయి. దీంతో ఉన్న కొద్దిపాటి నీటితో మండల పరిధిలో రైతులు ఉద్యాన పంటలను సాగు చేశారు. శని, ఆదివారాల్లో మండల పరిధి ఉత్తర భాగంలో కురిసిన భారీ వర్షాలకు నెర్నపల్లె, కృష్ణాపురం, జవ్వునిపల్లె, తోటకనుమ పంచాయతీలో పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. నెర్నపల్లె పంచాయతీ దయ్యాలపల్లెకు చెందిన మోహన్ అనే రైతు సాగు చేసిన ఎకరంన్నర కాకర తోట పూర్తిగా గాలుల తాకిడికి నేల మట్టమైంది. కిలో రూ.40 మేరకు ధర పలుకుతున్న కాకర తోట కోత కోస్తున్న దశలో నేల మట్టం కావడంతో ఆర్థికంగా నష్టపోయామని బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. కృష్ణాపురం పంచాయతీ యడగురికి చెందిన ఈశ్వర్ అనే రైతు సాగు చేసిన రెండెకరాల బీన్స్ తోట మీదుగా ఉలవకుంట వంక ఉప్పొంగడంతో పూర్తిగా నీట మునిగి పాడైంది. ఎక్కువ వర్షపాతం కురవడంతో బంతి పూల తోటలకు మచ్చ, తెగుళ్లు సోకాయి. కుమ్మరమడుగుకు చెందిన గురుస్వామి సాగు చేసిన ఎకరం కాకర తోట నేలమట్టమై, నీట మునిగింది. దీంతో తిరిగి పైకి లేపలేక కోత దశలో దిగుబడులు తీసుకోలేక, నేలకొరిగిన తోటను తీసి పడేయాల్సి వచ్చిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మంచి ధరలు పలుకుతున్న టమోటాకు వర్షం దెబ్బతో వైరస్‌సోకి తోటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. మరి కొన్నిచోట్ల చిక్కుడు, రాగి, వరి, అరటి, బీన్స్, చామంతిపూల తోటలు దెబ్బతిన్నాయి. ఈ వర్షాల పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, పంటలు నష్టపోయిన బాధితులు మాత్రం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు నష్టపోయిన బాధితులకు పరిహారం వచ్చేలా ప్రభుత్వం, ఉద్యానశాఖ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ



చెన్నపట్నం చెరువు కట్టపై కొట్టుకుపోయిన కల్వర్టును వెంటనే నిర్మించాలని కోరుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు

కల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, బాధిత ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అర్జీలు సమర్పించారు.

● ఎస్టీ కాలనీకి దారి లేకుండా పోయింది

సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు కట్టపై నిర్మించిన కల్వర్టు 2022లో తుఫాను కారణంగా కొట్టుకుపోవడంతో ఇదే మార్గంలో నడిచే గువ్వలగుట్ట ఎస్టీ కాలనీ ప్రజలకు దారిలేకుండా పోయిందని సోమల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు ఆయకట్టుదారుల చైర్మన్ తెలిపారు. మూడేళ్లుగా ఎస్టీ కాలనీ నుంచి ఇరికిపెంట పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కల్వర్టు కొట్టుకుపోవడంతో రైతులు చందాలు వేసుకొని తాత్కాలికంగా మరమ్మతులు చేయించుకున్నామని, చెరువు నిండితే మరింత ప్రమాదం పొంచి ఉందని, అధికారులు స్పందించి తక్షణమే కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

● ఎస్టీల భూములకు పట్టాలివ్వాలి

పులిచెర్ల మండలం రాయవారిపల్లి పంచాయతీలో సాగు చేసుకుంటున్న ఎస్టీల భూములకు పట్టాలివ్వాలని ఎస్టీ వాలంటరీ ఆర్గనైజర్ సభ్యులు శ్రీనివాసులు, గ్రామస్తులు లావణ్య, రవి, లలితమ్మ వినతి చేశారు. తాతల కాలం నుంచి ఎస్టీ కాలనీవాసులు 20 ఎకరాల భూమిలో వ్యవసాయం సాగు చేసుకుంటున్నామని, ఈ భూమికి పట్టాలివ్వాలని అనేక పర్యాయాలు అధికారులకు విన్నవించినా స్పందనలేదని చెప్పారు. ఎస్టీ కాలనీలో పాఠశాలకు వెళ్లే 7 మంది విద్యార్థులకు ఆధార్ కార్డులు లేవని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

● శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలి

పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లెలోని శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్థులు రాజేంద్ర, మనోహర్, వినాయక, నాగరాజు, వెంకటరత్నం కోరారు. 120 కుటుంబాలు ఉన్న తలారివారిపల్లెకు 50 సెంట్ల భూమి మాత్రమే శ్మశానవాటికకు కేటాయించారని, ఆ స్థలం సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి కమ్యూనిటీ హాలు మంజూరుచేయాలని కోరారు.

● రేషన్‌కార్డులో పిల్లల పేర్లు నమోదు చేయాలి

తనకు కారు లేకున్నా ఉన్నట్లు చూపిస్తుండటంతో తన రేషన్ కార్డులో తమ ఇద్దరు పిల్లల పేర్లు నమోదు చేయడంలో ఇబ్బందులు పడుతున్నామని పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన షేక్ షమీఉల్లా మొరపెట్టుకున్నారు. అధికారులు స్పందించి రికార్డుల్లో తనపేరు తొలగించి రేషన్‌కార్డులో తమ పిల్లల పేర్లు నమోదు చేయాలని కోరారు.

● పులిచెర్ల మండలం ఈ.రామిరెడ్డిపల్లెకు చెందిన కె.సుజాత 10 ఏళ్లుగా పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నానని, 90 శాతం వైకల్యం ఉన్నట్లు సదరం క్యాంపు సర్టిఫికెట్ ఇచ్చినా వికలాంగుల పింఛను మంజూరు చేయలేదని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

● రొంపిచెర్ల మండలం దద్దాలవారిపల్లెలో 250 కుటుంబాలు నివసిస్తున్నాయని, రేషన్ తీసుకోవాలంటే మూడు కిలోమీటర్ల దూరంలోని బోడిపాటివారిపల్లెకు వెళ్లడం ఇబ్బందిగా ఉందన్నారు.

కలెక్టర్ చొరవతో బాలుర వసతి గృహం ప్రారంభం

సోమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సోమల తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో బాలుర వసతి గృహన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో సోమవారం ప్రారంభించారు. 12 ఏళ్ల క్రితం సోమలలో ఎస్సీ బాలికల కోసం రూ.69 లక్షల వ్యయంతో నూతనంగా భవనాలు నిర్మించారు. ఐదేళ్లుగా విద్యార్థుల ప్రవేశం తగ్గిపోవడంతో అధికారులు వసతి గృహనికి తాళం వేశారు. అప్పటి నుంచి నిరుపయోగంగా మారింది. ఈక్రమంలోనే స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం హేమసుధాకర్, ఉపాధ్యాయులు, స్థానిక టీడీపీ నాయకులు పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని, కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలసి వసతి గృహన్ని తిరిగి ప్రారంభించాలని వినతి చేశారు. దీంతో కలెక్టర్ వెంటనే స్పందించి బాలికల వసతి గృహంలోనే బాలుర వసతి గృహంగా పునఃప్రారంభం చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బాలుర వసతి గృహం ప్రారంభం జరిగింది. వసతి గృహంలో సోమల ఉన్నత పాఠశాలకు చెందిన 50 మందిని చేర్చడానికి సిద్ధం చేశారు. పుంగనూరు ఏఎస్‌డబ్ల్యూవో శ్రీరాములు నాయక్, వార్డెన్లు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి



కంప్యూటర్లు, ప్రింటర్లు అందిస్తున్న దశరథరెడ్డి

శాంతిపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యాభ్యాసం చేయాలని వి.కోట అమ్మాయక్ఫ్ చైర్మన్ దశరథరెడ్డి అన్నారు. సోమవారం శాంతిపురం జూనియర్ కళాశాలకు 21 కంప్యూటర్లు, 3 ప్రింటర్లు, 50 డెస్కులను విరాళంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.వి జయకుమార్‌కు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా దశరథరెడ్డికి విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, అధ్యాపకులు సావిత్రమ్మ, రామూర్తి, రామసుబ్బయ్య, మధు, మంజునాథ్, శ్రీనివాసులు, విజయలక్ష్మి, చాముండేశ్వరి, సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పుంగనూరు విద్యార్థుల ప్రతిభ



పతకాలు, ప్రశంసాపత్రాలతో కరాటే పోటీల విజేతలు

పుంగనూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 5వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్ 2025 నేషనల్ సెలక్షన్స్ పోటీల్లో పుంగనూరు మహేశ్ మార్షల్స్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రెడ్డిమహేశ్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి గంధమనేని శివయ్యకృష్ణారెడ్డి భవన్‌లో జరిగిన పోటీల్లో పుంగనూరుకు చెందిన వై.కిరణ్‌కుమార్, కె.పవిత్ర, జి.లహరి, ఎస్.జుహఫాతిమా, ఎన్.సుదీప్, ఎస్.జోయా, ఎ.సాయివిష్ణు, టి.గగన్‌వికాశ్, వి.కృష్ణలు పతకాలు సాధించారని చెప్పారు. వీరు హర్యానాలో జరిగే ఆల్‌ఇండియా కరాటే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని హెడ్‌కోచ్ మహేశ్, కోలా ప్రతాప్‌లు అభినందించారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ప్రాకారోత్సవం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలోవున్న రాఘవేంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావనంలో ప్రవేశించిన పవిత్రదినం కావడంతో అర్చకులు రమేష్ ఆచార్యులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉడిపి గోపాలాచార్యులచే ప్రవచన కార్యక్రమం జరిగింది. గురురాజా సేవాసమితి ప్రతినిధులు మురళీధరరావు, మోహన్, శ్రీనివాసమూర్తి, ఆనందరావు, సుబ్బన్న, మధుసూధన్, సుందరేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'అమలు కాని హామీలతో మోసం'

సదుం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అమలు కాని హామీలతో కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలను మోసం చేశారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని చీకలచేను, బూరగమంద, సదుం పంచాయతీ కేంద్రాల్లో సోమవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే గిరిజనుల అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం, వారు పండించే పంటలకు, ఉత్పత్తులకు పలు సంస్థలతో ఒప్పందాలు జరగడం వారి అభివృద్ధికి మొదటి మెట్టన్నారు. అరకు కాఫీ బ్రాండింగ్‌కు టాటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఆదివాసీల జీవనోపాధి అవకాశాలు, వ్యవసాయ అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరచాడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కీలకమైన ఒప్పందాలు జరిగాయని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చట్టాలు అమలు చేయడం, శాంతిభద్రతలు పునరుద్ధరించడం జరిగిందని ఇండియా జస్టిస్ రిపోర్ట్‌లో పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. పేదరిక నిర్మూల కోసం చంద్రబాబు తీసుకువచ్చిన పి-4 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ల పంపిణీ

పుంగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వందశాతం ఉత్తీర్ణత సాధించిన పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ విద్యార్థులు 25 మందికి 35ఏ బెటాలియన్ చిత్తూరు ఎన్‌సీసీ యూనిట్ ఆఫీసర్ సోమరాజు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక కాలేజీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీ, సీ సర్టిఫికెట్లు అందజేశామని, వీరికి 15 శాతం రిజర్వేషన్ ప్రతి పోటీ పరీక్షలో ఉంటుందని వివరించారు. విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపక బృందం అభినందించింది.

బోయకొండ ఆలయ చైర్మన్ పదవి వాల్మీకులకు ఇవ్వాలి

చౌడేపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని వాల్మీకులకు ఇవ్వాలని వాల్మీకి మహాసేన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. 2012 నుంచి వాల్మీకులకు చైర్మన్ పదవి ఇస్తామని మాటలు చెప్పారే తప్ప ఇంత వరకు ఇవ్వలేదన్నారు. అనంతరం అమ్మవారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు ముత్తారాశి హరికృష్ణ, విజయ్‌కుమార్, దేవరెంటి సుధాకర్, చంగల్‌రాయులు, బొంత గోపాల్, చినరాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయానికి విరాళాలు

సోమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నడింపల్లె పంచాయతీ కరకమంద వద్ద నూతనంగా నిర్మిస్తున్న పోలేరమ్మ ఆలయానికి సూరయ్యగారిపల్లె గ్రామస్తులు రూ.1,57,116 విరాళాన్ని ధర్మకర్త శ్యాంసుందర్‌బాబుకు అందజేశారు. కరకమంద, నడింపల్లె, సూరయ్యగారిపల్లె గ్రామాలకు సంయుక్తంగా అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ వైఎస్ మునిరత్నం, జీసీకే ప్రసాద్, వెంకటరత్నం, కర్రి హరినాథ్, నరసింహులు, పెద్దబ్బ, భాస్కర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై సర్వే

చౌడేపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మాదిగకుంట చెరువు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా వీఆర్‌వో రెడ్డప్ప మాట్లాడుతూ.. జూలై 25న టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి మండలంలోని కాటిపేరి పంచాయతీలోని మాదిగ కుంట చెరువు దురాక్రమణలకు గురైందని తహసీల్దార్ పార్వతికి ఫిర్యాదు చేశారన్నారు. తహసీల్దార్ ఆదేశాలతో తాము సర్వే నిర్వహించామని, ఉన్నతాధికారులకు నివేదికలను ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్వేయర్ శారద తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నేత కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుచేసినా అధికారులు సమస్యను పరిష్కరించకుండానే ఫిర్యాదు మూసేస్తున్నారని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, చెరువుల ఆక్రమణలను అరికట్టాలని కోరారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నగరి టీడీపీ అధ్యక్షుడిగా గుణశేఖర్



రమేష్‌బాబుకు బైక్ కీ అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ - గుణశేఖర్,శ్రీనివాసన్

నగరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ టీడీపీ సంస్థాగత ఎన్నికలు సోమవారం ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. పట్టణ అధ్యక్షుడిగా జి.గుణశేఖర్, కార్యదర్శిగా శ్రీనివాసన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ.. తాజా మాజీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు సేవలు అభినందనీయమని చెప్పారు. రెండుసార్లు ఆయన అధ్యక్షుడిగా పనిచేయడంతో కొత్తవారికి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం రమేష్‌బాబును సన్మానించి, ఎలక్ట్రిక్ బైక్‌ను బహుమతిగా ఇచ్చారు.

ఎల్‌ఆర్‌ఎస్ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం దీనికి సంబంధించిన కరపత్రాలను తన చాంబర్‌లో ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి వర్మ తదితరులతో కలిసి కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆవిష్కరించారు.

అర్జీల స్వీకరణ: నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో బాధితుల నుంచి అర్జీలను కమిషనర్ నరసింహ ప్రసాద్ స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఇంజనీరింగ్‌కు 6, రెవెన్యూకు 2, ప్రజారోగ్య విభాగాని ఒక అర్జీ చొప్పున వచ్చాయి. ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

నగరంలో తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నగరపాలక సిబ్బంది

చిత్తూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని ప్రధాన కూడళ్లలో 'హర్‌ఘర్ తిరంగా.. హర్‌ఘర్ స్వచ్ఛతా' ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ నిర్దేశంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, పారిశుధ్య కార్మికులు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం: టీడీపీ


శ్రీరామపురంలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

నింద్ర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం శ్రీరామపురం పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు వెంకటేశులురెడ్డి, మనోహర్‌నాయుడు, కాటయ్య, మనోజ్ యాదవ్, అప్పారావు, డిల్లీనాయుడు, ప్రసాద్‌రెడ్డి, జీవయ్య, లింగయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని వరసిద్ధుడి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి మదనపల్లెకు చెందిన శైలజారెడ్డి రూ.1,00,016లను సోమవారం విరాళంగా అందించారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాటు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

వెదురుకుప్పం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని వెదురుకుప్పం తహసీల్దార్ బాబు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో రైతులు, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

విద్యార్థులకు 'శుభ్ దిన్ తిథి' భోజనం

వెదురుకుప్పం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యాలయాల్లో విద్యార్థులకు తిథి భోజన్ కార్యక్రమంలో భోజనం, రిఫ్రెష్మెంట్ అందించే గొప్ప అవకాశం దాతలకు ఒక వరమని కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాదమునిరెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో పూర్వ విద్యార్థి శేషరాజు వితరణతో 138 మంది విద్యార్థులకు శుభదిన్ భోజన్ పేరిట మధ్యాహ్న భోజనంలో అరటిపండ్లు, లడ్డు తదితర వాటిని అందించారని హెచ్‌ఎం తెలిపారు.

రేపు 'మరుదు పాండియార్స్' కాంస్య విగ్రహాల ఆవిష్కరణ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గంగినేని చెరువు సమీపంలో బుధవారం మా మన్నార్ మరుదు పాండియార్స్ కాంస్య విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ మొదలియార్ సంఘం అధ్యక్షుడు బుల్లెట్ సురేష్ తెలిపారు. మరుదు పాండియార్స్ 1780 నుంచి 1801 వరకు తమిళనాడులోని శివగంగై ప్రాంతాన్ని కులమతాలకు అతీతంగా ప్రజారంజకంగా పరిపాలించారన్నారు. బ్రిటీష్ వారి ఆధిపత్యానికి లొంగక పోవడంతో చివరకు ఆయన నిర్మించిన ఆలయాలను కూల్చడానికి ప్రయత్నించారన్నారు. దాంతో వారికి లొంగిపోయి వీరమరణం పొందారన్నారు. వారి స్మారకార్థం కాంస్య విగ్రహాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

'చంద్రబాబు కోసం మొక్కు తీర్చుకోవడం నేరమా?'


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సీఎం అయితే మొక్కు తీర్చుకోవడం నేరమా అంటూ టీడీపీ నాయకులు రామానుజం చలపతి, లతా ఉమాపతి ప్రశ్నించారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద వినాయకుడి ప్రతిమ, చంద్రబాబు చిత్రపటంతో సోమవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఆర్థిక కారణాలతో నగరిపేటలో ఆగిపోయిన వినాయకస్వామి గుడిని చంద్రబాబు సీఎం అయ్యాక నిర్మించాలనుకుని మొక్కుకుని ఆ మేరకు పనులు చేపడితే కొన్ని దుష్టశక్తులు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. గుడి కట్టకుండా అడ్డుకుంటున్నదెవరో అధికారులు నిజాన్ని నిగ్గుతేల్చాలని కోరారు.

ఈ సమస్యకు పరిష్కారం ఎప్పటికో..?



నగరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షం కురిసినా నగరి రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అండర్ బ్రిడ్జిలో నీరు చేరిపోతుంది. వాహనాల రాకపోకలకు అంతరాయం తలెత్తుతోంది. వానాకాలంలో మేలపట్టు, ముడిపల్లె, రామాపురం, ఏడుగట్లు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి: తహసీల్దార్

నింద్ర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ శేషగిరిరావు ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో గ్రామ సచివాలయ వీఆర్వో, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. భూ రీసర్వేలో సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్ డీటీ, సర్వేయర్, ఆర్‌ఐ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు


మాధవ్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయనకు ఈవో పెంచలకిషోర్ స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, బీజేపీ నాయకులు జగదీశ్వరనాయుడు, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిగ్రీ వరకు తెలుగు మాధ్యమాన్ని అమలు చేయండి

● తెలుగు సాహిత్య సమితి వినతి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు తెలుగు మాధ్యమాన్ని కచ్చితంగా అమలు చేయాలని తెలుగు సాహిత్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తులసీనాథం నాయుడు కోరారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సోమవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వినతిపత్రం అందజేశారు.

'బీసీలకు న్యాయం చేయండి'


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నేతలు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం డిమాండ్ చేశారు. బీసీల జనగణన చేయాలని కోరుతూ సోమవారం బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి హేమావతి, ఇతర నేతలతో కలిసి చలో డిల్లీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 56శాతానికిపైగా ఉన్న బీసీల జనగణన మాత్రం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18, 19 తేదీల్లో డిల్లీ జంతర్‌మంతర్ వద్ద చేపట్టే ధర్నాకు వందలాదిగా బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నేతలు పూసల రవి, ప్రసన్నకుమార్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విజేతలకు అభినందన



చిత్తూరు క్రీడలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి చెస్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారని ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్ తెలిపారు. సోమవారం అసోసియేషన్ కార్యాలయంలో క్రీడాకారులను అభినందించారు. అర్జున్ అండర్-9 విభాగంలో సిల్వర్ మెడల్‌ను, అండర్-7లో సిద్ధార్థ మూడో స్థానంలో, లోహిత్, మణిదీప్‌లు కన్సొలేషన్ బహుమతులు సాధించారన్నారు. అసోసియేషన్ నాయకుడు మధు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్‌ఎంఏ) ద్వారా గర్భిణులకు ఉచితంగా ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్లు ప్రవీణ్, మౌనిక తెలిపారు. తూగుండ్రం పీహెచ్‌సీలో సోమవారం 37మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మంగళవారం నుంచి 51 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతోపాటు ప్రైవేటు బడుల్లోని విద్యార్థులకు, 48 అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నివారణకు మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి

● ఆత్మ మాజీ చైర్మన్ రాజేష్‌రెడ్డి



ఐరాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఆత్మ మాజీ చైర్మన్ అయిరాల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా.. అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో రెండు లక్షలకు పైగా రైతులకు రూ.138 కోట్లు విడుదల చేయడం హర్షణీయమని చెప్పారు. అలాగే తోతాపురి మామిడి కాయలకు టన్నుకు రూ.4 రూపాయల సబ్సిడీ ఇచ్చి రైతులను సకాలంలో సీఎం చంద్రబాబు ఆదుకున్నారని చెప్పారు.

డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ మహేశ్వర

చిత్తూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అపోలో మెడికల్ కాలేజీలో నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం ఒకటో పట్టణ సీఐ మహేశ్వర ఆధ్వర్యంలో జరిగింది. డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. డ్రగ్స్ వాడకంతో కలిగే నష్టాలు, సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాస్ ఎన్‌జీవో మేనేజర్ ప్రతిమ, అపోలో కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మ జ్ఞాన ధ్యాన సదస్సు

తవణంపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంక్రాస్ సిద్ధంపల్లె వద్ద ఉన్న శ్రీవిఘ్నేశ్వర మహా పిరమిడ్ జ్ఞానక్షేత్రంలో ఆత్మ జ్ఞాన ధ్యాన సదస్సును సోమవారం నిర్వహించారు. మనం చూసే దాన్నిబట్టే సృష్టి కనబడుతుందని తెలంగాణకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఆనంద ప్రసాద్ తెలిపారు. గోపాలకృష్ణమూర్తి, నరేంద్ర అసూరి, కేశవరాజు, ధ్యానులు పాల్గొన్నారు.

ఇవి రోడ్లే..!

● గుంతలయమైన రహదారులతో ఇబ్బంది పడుతున్న స్థానికులు


వీఎస్ అగ్రహారంలోని అరుణానగర్, ఈద్గా వద్ద ధ్వంసమైన రహదారులు

ఐరాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వీఎస్ అగ్రహారంలోని ఈద్గా, అరుణానగర్ వద్ద రోడ్లు గుంతలమయ్యాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో ఈ రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. ఈ మార్గంలో రోజూ వందలాది మంది రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధాని మోదీని కలిసిన కూటమి ఎంపీలు

చిత్తూరు సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూటమి ఎంపీలు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం డిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానిని సత్కరించారు. ఈ సందర్భంగా మోదీకి శ్రీవారి ప్రతిమను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అందించారు. రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు.


ప్రధాని మోదీకి శ్రీవారి ప్రతిమను అందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

కమనీయం.. కల్యాణం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని పచ్చియమ్మన్ మన్నారు ఆలయంలో సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని సోమవారం కమనీయంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానికులతోపాటు మురకంబట్టు, కట్టమంచి, చవటపల్లెవాసులు పాల్గొన్నారు.

తిరుత్తణికి తరలిన భక్తులు


కుర్పపల్లెలో కావళ్లతో భక్తులు

బంగారుపాళ్యం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరుడికి మొక్కులు తీర్చుకోవడానికి గుంతూరు పంచాయతీలోని కుర్పపల్లె గ్రామస్తులు కావళ్లతో సోమవారం తరలివెళ్లారు. సుమారు 70 మంది కావళ్లతో బయల్దేరడంతో గ్రామవీధులు పసుపుమయంగా మారాయి. గ్రామపెద్దలు సుబ్రహ్మణ్యం గౌడ్, చలపతి, రామయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పెనుమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు శివాలయంలో నూతనంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. వేదపండితుడు శివరామశర్మ బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉభయదారులుగా తిరివిరెడ్డిపల్లెకి చెందిన జయరామనాయుడు, ఈశ్వర్‌ప్రసాద్, సర్పంచ్ కుసుమ దంపతుల కుటుంబీకులు వ్యవహరించారు.

గణపతి ఆలయ ప్రాణ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం


పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాతవెంకటాపురం పంచాయతీ గరిగెలపల్లెలో నూతనంగా నిర్మించిన గణపతి దక్షిణమూర్తి మహాలక్ష్మి విద్యాసరస్వతి ఆలయ ప్రాణప్రతిష్ఠ, కుంభాభిషేకం పూజలు సోమవారం రాత్రి ప్రారంభించారు. బెంగళూరులోని కోటి జలకంఠేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు సుబ్రమణ్య శాస్త్రి , వైదిక బృందం ఆచార్యుడు లక్ష్మీనరసింహ శాస్త్రి బృందం ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

సత్యమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



శ్రీరంగరాజపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 49.కొత్తపల్లెమిట్ట గ్రామదేవత సత్యమ్మ తల్లి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ డి.వి.డిల్లెయ్య, పవన్ ప్రసాద్, విష్ణు ప్రసాద్, బిగ్‌బాస్, ముని, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన పోస్టర్ల ఆవిష్కరణ

వెదురుకుప్పం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పోస్టర్లను ఎంపీడీవో పురుషోత్తం సోమవారం ఆవిష్కరించారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ కృష్ణచైతన్య, ఎంఈవో దామోదరం, సీహెచ్‌వో మధుసూదన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల, సూపర్‌వైజర్ మోహన్‌మురళి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ● కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన్, డాక్టర్ పీవీ భువనేశ్వరి, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించాడని ఏడాది జైలు


పోలీసుల అదుపులో సురేష్ నాయుడు

చిత్తూరు లీగల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. బంగారుపాళ్యం మండలం గౌరీ శంకరపురంలో నివాసం ఉండే డబ్బర చిలకమ్మ, ఆమె కుటుంబీకులతో అదేగ్రామానికి చెందిన సురేష్ నాయుడుకు 2017 మార్చి మూడో తేదీన నీటి సరఫరాకు సంబంధించి గొడవ జరిగింది. ఆపై ఊరి పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. పంచాయితీ పెట్టడంపై సురేష్ నాయుడు ఆగ్రహించి.. చిలకమ్మ, ఆమె కుటుంబీకులను కులం పేరుతో అసభ్యంగా దూషించి, భౌతికదాడి చేశాడు. ఈ ఘటనపై బాధితులు బంగారుపాళ్యం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు సోమవారం విచారణకు రాగా పూర్వాపరాలు పరిశీలించాక చిత్తూరు ఒకటో అడిషనల్ కోర్టు జడ్జి ఎస్ రమేష్.. సురేష్ నాయుడికి ఏడాది జైలు శిక్ష రూ.5 వేల జరిమానా విధించారు.

సంక్షిప్తంగా..

కుంభాభిషేక పూజలు

విజయపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నారపరాజుకండ్రిగలో సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయ మహా కుంభాభిషేక పూజలను సోమవారం ప్రారంభించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో రెండ్రోజులపాటు పూజలు జరుగుతాయని పూజారి వందవాసి మహేష్‌శర్మ తెలిపారు.

'పీజీఆర్‌ఎస్'కు 13 అర్జీలు

బంగారుపాళ్యం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 13 అర్జీలు అందాయని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన సమస్యల్లో దారి, భూసమస్యలు ఉన్నట్లు చెప్పారు. వారంలోపు పరిష్కరించాలని వీఆర్వోలు,సర్వేయర్లకు సూచించారు. మండల సర్వేయర్ లావణ్య, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బురదమయంగా గ్రామీణ రోడ్లు


గొల్లకండ్రిగ రోడ్డు దుస్థితి

విజయపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం పాటు కురుస్తున్న వర్షానికి గ్రామీణ రోడ్లు బురదమయంగా తయారయ్యాయి. గొల్లకండ్రిగ, ఎం.అగరం - చివ్వాడ రోడ్డు, కేవీశ్రీరామాపురం, వరదరాజులు కండ్రిగ రోడ్లు బురదతో నిండిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

సచివాలయంలో ప్రింటర్ చోరీ

పెనుమూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కేసీపల్లె సచావాలయంలో ప్రింటర్‌ను చోరీ చేశారు. సచివాలయం శుభ్రం చేసే మహిళ సోమవారం ఉదయం 8.30 గంటలకు రాగా.. తలుపుకున్న తాళం, గడియ పగులగొట్టి ఉన్నాయి. ఆమె వెంటనే సెక్రటరీ ప్రసన్నకు సమాచారం ఇచ్చారు. సెక్రటరీ 10 గంటలకు వచ్చి చూడగా ప్రింటర్ కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వెంకటనరసింహం తన సిబ్బందితో సచివాలయాన్ని తనిఖీచేసి కేసు నమోదు చేశారు.

211 మద్యం సీసాల స్వాధీనం

విజయపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విజయపురంలో సోమవారం వినాయక గుడి పక్కన లక్ష్మీకాంతమ్మ(74) తన ఇంట్లో బ్లాక్‌లో మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహేష్‌బాబు తెలిపారు. ఆమె వద్ద నుంచి 211 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థిని అదృశ్యంపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. శ్రీనగర్‌కాలనీలో శంకర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె బాలాంబిక ఉన్నారు. బాలాంబిక కుప్పంలోని నర్సింగ్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ చివరి సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈవిషయాన్ని కుమారుడు రమేష్‌కు తల్లి చెప్పింది. తెలిసిన, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో రమేష్ ఫిర్యాదు చేశాడు.

మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10వేల జరిమానా: సీఐ

బంగారుపాళ్యం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10వేల జరిమానా విధిస్తారని సీఐ కత్తి శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై పాలేరు ఫ్లైఓవర్ వద్ద వద్ద వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిని గుర్తించి, కేసు నమోదు చేశామన్నారు. పీఎస్‌ఐ అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.